# తరతరాలుగా జీర్ణించుకుపోయిన పురుషాధిక్య భావజాలం మగాడికి తమాషాగా కనిపించవచ్చు కానీ, దాని వేదన స్త్రీనే స్పృశిస్తుంది

రోజూ మోహన్ ఆఫీసు నుంచి వచ్చాక, ఇద్దరికీ టీ చేసే పద్మ ఆ సాయంత్రం అతనొచ్చే దాకా ఆగలేనట్టు ముందుగానే చేసింది. మోహన్ కోసం కొంత టీని ఫ్లాస్కులో పోసి ఉంచి, తాను కొంత తెచ్చుకుని కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుంది. టీ తాగుతూ తాగుతూ ఉండగా ఆ రోజు అంతవరకూ పేపర్ మొహమే చూడలేదన్నది జ్ఞాపకం వచ్చి, లేచి వెళ్ళి, వెతికి వెతికి ఆఖరికి బెడ్ రూమ్‌లో మంచం కింద ఉన్న పేపర్‌ను తెచ్చుకుని మళ్ళీ కూర్చుంది. అప్పటికే చల్లారిపోయిన టీని ఒక్క గుక్కలో మింగేసి, పేపర్ తెరిచింది. పేపర్ క్షతగాత్రంతో దీనంగా ఉంది. పాపం, దాని ఆయుస్సే ఒక్క రోజు. ఆ ఒక్క రోజు కూడా పూర్తిగా బతకనీడు రవి. అలా పేపర్ చించకూడదని వాడికీ, ఆ విధంగా చించకుండా చూడమని మోహన్‌కీ మొత్తుకుని చెప్పినా ప్రయోజనం లేకుండాపోతోంది.

"అబ్బ, వాడికేం తెలును లెద్దూ" అంటాడు మోహన్.

"వీడికి తెలీదా" అని కోపంగా పద్మ అడిగితే–

"డెయిలీ పేపర్ చించితే ఏమయింది లెద్దూ" అని ఒక చిన్న నవ్వుతో, ఇంకొక 'లెద్దూ'తో ఆమె కోపాన్ని పోగొట్టాలని చూస్తాడు.

"డెయిలీ పేపరంటే డెయిలీ చించెయ్య వలసిన పేపరని అర్థమా?"

"డెయిలీ ఎక్కడ చించేస్తున్నాడు? ఒక్కో రోజు వాడు మరిచిపోతాడు తెలుసా?" ఈసారి బిగ్గరగా నవ్వుతాడు.

ఉదయంపూట తనకు పేపర్ చూసే టైముండదు. రవికీ, మోహన్‌కీ టిఫిన్ తయారుచేసి, ఆ తర్వాత అందరికీ భోజనాలకు ఏర్పాట్లు చేసి, తన భాగం బాక్సులో సర్దుకుని, ఏవేం తీసుకెళ్ళాలో మోహన్‌కు వివరించి, మధ్యలో కాఫీ, టీ ఇచ్చి... ఎనిమిది లోపలే బయల్దేరితే కానీ, ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న తాను పని చేసే స్కూలుకు చేరుకోలేదు. తాను వెళ్ళిన తర్వాత, రవిని మోహన్ కేర్ సెంటర్‌లో వదిలేసి ఆఫీసుకు వెళ్ళిపోతే, సాయంత్రం తాను స్కూలు నుంచి వచ్చేటప్పుడు రవిని తీసుకొస్తుంది. ఇదే రోజువారీగా జరిగేది.

"పద్మ పేపర్ చదవగలిగేది సాధారణంగా సాయంత్రాలనే కదా, అంతవరకూ దాన్ని జాగ్రత్తగా ఉంచుదాం" అనుకోడు మోహన్. ఇంట్లో ఫలానా చోట అంటూ పేపర్ ఉండదు. ఎక్కడైనా ఉండవచ్చు, ఎక్కడైనా లేకపోవచ్చు. చాలాసార్లు పేపర్ శవం కూడా ఎక్కడా కనిపించదు. ఆ సమయంలో మోహన్ మాటలు ఇవీ:

"అందులో ఏం లేదు లేవోయ్... ప్చ్" అని చప్పరిస్తాడు.

"అందులో ఏదన్నా ఉందో, ఏదీ లేదో నేను చదివితే కదా నాకు తెలిసేది."

"నేను చదివానుగా..."

"చూస్తే 'నేను అన్నం తిన్నానుగా, నువు తినకపోతేనేం' అనేట్టున్నావు."

"అన్నిటికీ తర్కమేనా, మామూలు మాటక్కూడా ఇంత తర్కమెందుకు?"

'నేను చదివానుగా, నువు చదవకపోతేనేం' అన్నమాట 'మామూలుమాటై', 'నువ్వు చదివితే నాకేం తెలుస్తుంది, నేనూ చదవాలిగా' అన్న మాట 'తర్కం' అయిందా? నిజంగా తర్కం పెట్టుకునే ఓపిక లేక ఊరుకుంటుంది పద్మ.

ఆ పేపర్ పరిస్థితి చూశాక, ఆ రోజు దాన్ని చదవాలనిపించలేదు పద్మకు. ఆ అనాసక్తికి ఇంకోకారణమూ ఉందేమో! అంతకుముందే గ్లాసెడు పాలు ఒలకపోసినందుకు రవి వీపున రెండు దెబ్బలు వేసింది. అంత గట్టిగా కొట్టాలనుకోలేదు కానీ, బాగా విసుగొచ్చిందేమో కొట్టేసింది. చాలాసేపు ఏడ్చాడు. అందుకు ఇప్పుడు బాధ కలుగుతున్నట్టుంది.

ఆ బాధను సర్దుకునేందుకే, మోహన్ రాకపోయినా టీ చేసుకుని తాగాలనుకుందేమో! పద్మ ఇలా ఆలోచిస్తుండగానే, మెదడు అలసిపోయినట్టు ఆలోచన ఆగి, ఆ తర్వాత తెగినట్టు కదలకుండా కళ్ళు మూసుకుంది. బయట పొద్దు కుంకి క్రమంగా కమ్ముకొస్తున్న చీకటిలో తాను కలిసిపోతోందా, లేక ఆక్రమిస్తున్న నిద్రమత్తు తనను అశక్తురాలిని చేస్తోందా తెలీనట్టు ఉండిపోయింది.

తనకే మెలకువ వచ్చిందో, లేక బయటి గేటు చప్పుడు మెలకువ తెప్పించిందో కానీ, వేళ కాని వేళ అలా కుర్చీలో కూర్చునే నిద్రపోయినందుకు ఆశ్చర్యపడింది పద్మ. ముందు గదిలోనూ, వంటింట్లోనూ లైట్లు వెలిగించి, ఇక వంటపనిలోకి దిగాలి అనుకుంది.

"అవును, ఇంతవరకూ రవి ఎక్కడున్నట్టు" అన్న ప్రశ్న అప్పుడు లైటు వెలిగినట్టు వెలిగింది. వాణ్ణి కొట్టినందుకు ఇంతవరకూ బాధపడిన పద్మ, వాడెక్కడున్నదీ పట్టించుకోకుండా నిద్రపోయినందుకు ఇప్పుడు సిగ్గుపడింది. ఎంతసేపు నిద్రపోయిందీ తెలుసుకోవాలని గడియారం కేసి చూసి, పావు గంట



"నాన్నా, నాన్నా, అమ్మ
కొట్టింది నాన్నా.
నాన్నా, నువు అమ్మను గట్టిగా
కొట్టు నాన్నా."
"సరే, అలాగే కొడతాలే."
"నాన్నా, అమ్మను ఇంట్లో
నుంచి పంపించెయ్యి."
"సరే..."
"ఇప్పుడే పంపించెయ్యి."

# తమాషా

కూడా కాలేదని తెలిశాక, కొంచెం స్తిమిత పడింది.

రవి పక్కింటి వాళ్ళ పిల్లల్తో ఆడుకుంటూ ఉండి ఉంటాడు. మోహన్, రవీ మాట్లాడుతుండడం వినిపించాక, గేటు తీసింది మోహనేనని తెలుసుకుంది పద్మ. ఆ మాట్లాడుతున్న పద్ధతిని బట్టి చూస్తే, మోహన్ రవిని ఎత్తుకొని ఉన్నట్టు అర్థమవుతోంది.

"నాన్నా, నాన్నా, అమ్మ కొట్టింది నాన్నా."

ఆ సంగతి తాను మరచిపోలేనట్టే వాడూ మరచి పోలేదన్నమాట... అనుకుంటూంటే పద్మ మనసు ఆర్ద్రమైంది.

"కొట్టిందా? ఎందుకూ?"

"ఎందుకో..."

వాడి తప్పేదో వాడు తెలుసుకోలేక పోవడమేనా? లేక తన తప్పేదీ లేదని చెప్పి, తండ్రి సానుభూతి సంపాదించాలని చూడడమా. ఆ మూడేళ్ళ పసివాడికి అప్పుడే అంతటి తెలివితేటలు అబ్బి ఉంటాయా!

"గట్టిగా కొట్టింది నాన్నా." - నిజమే. తాను గట్టిగానే కొట్టింది. "ఇక్కడ నొప్పిగా ఉంది నాన్నా." చొక్కా ఎత్తి వాడు వీపు చూపించడమూ, మోహన్ వాడి వీపు నిమరడమూ,



చూడకుండానే చూడగలిగింది పద్మ. ఇదీ నిజమే. వాడికి నొప్పి తగిలి ఉండవచ్చు. వాడి చిన్ని, లేత వీపు కంది ఉండవచ్చు. పద్మ కళ్ళు తడిశాయి.

"నువ్వేం చేయకుండానే అంత గట్టిగా కొట్టిందా?"

"ఊఁ... నాన్నా."

'ఊఁ... నాన్నా' ఏమిటో. 'ఊఁ...' అంటే పోదూ. పద్మ తడికళ్ళలో నవ్వు మెరుపు.

"నాన్నా, నువు అమ్మను గట్టిగా కొట్టు నాన్నా."

"సరే, అలాగే కొడతాలే."

"నాన్నా, అమ్మను ఇంట్లో నుంచి పంపించెయ్యి."

"సరే..."

"ఇప్పుడే పంపించెయ్యి."

"ఇప్పుడా? చీకటిపడిపోయిందిగా... రేపు పంపిద్దాంలే."

"రోడ్డు మీద లైట్లు ఉన్నాయిగా."

మోహన్ దానికి ఏం జవాబు చెప్పాడో వినకుండానే వంటింట్లోకి నడిచింది పద్మ.

* * *

"నాన్నా, అమ్మ నన్ను కొత్తింది. అమ్మను కొత్తు నాన్నా."

వాడు రవి కాదు. ఆ నాన్న రవి నాన్న మోహన్ కాదు. వాడు తన తమ్ముడు సీను (శ్రీనివాస్), ఆయన తన నాన్న నాగభూషణరావు. వాడికింకా మాటలు సరిగా రావు. ట, ర, ల వంటి అక్షరాల్ని పలకలేడు. అయిదేళ్ళ వయసున్నా, పొట్టిగా బుడంకాయలా ఉంటాడు. మాటలింకా సరిగా రాకపోయినా, అమ్మ మీద ఫిర్యాదు చేయడమూ, అమ్మను కొట్టమని చెప్పడమూ నేర్చుకున్నాడు. నేర్చుకున్నాడంటే, నేర్పేవాళ్ళుండ బట్టే నేర్చుకున్నాడు. అందుకు ప్రథమ గురువు నాగభూషణరావుగారి అమ్మగారు. అంటే, తన నాన్నమ్మ పిచ్చమ్మగారు. అమ్మ ఎప్పుడైనా కోప్పడితేనో, లేక ఒక దెబ్బ వేస్తేనో, ఏడుస్తున్న సీనుగాడిని ఆమె దగ్గరికి తీసుకునేది. "మీ నాన్నొస్తే అమ్మని కొట్టమని చెబుదాంలే. ఏడవకు" అని ఓదార్చేది. ఒక్కోసారి "అమ్మను ఇంట్లో నుంచి పంపిద్దాంలే, నాన్నతో అమ్మను బాగా తన్నిద్దాంలే" అనీ హామీ ఇచ్చేది. హామీ ఇవ్వడమే కాక, ఆ హామీ నెరవేరేలా చూసే బాధ్యత కూడా తీసుకునేది. అదెలా ఉండేదని. తాను న్యాయమూర్తిలా కూర్చొని, ఫిర్యాదు చేసిన సీనుగాడూ, వాడి అక్కలు ముగ్గురూ, ఇంకా తదితర కుటుంబ సభ్యులూ, ఆ సమయానికి ఎవరైనా ప్రేక్షకులు దొరికితే వాళ్ళూ చూస్తూ ఉండగా, ముద్దాయిని రప్పిస్తుంది. న్యాయస్థానాల్లో నేరం నిరూపణ కాకపోతే ముద్దాయి నిర్దోషిగా విడుదలవుతారు. ఇక్కడదేం లేదు. ఆరోపణే నిరూపణ. నలుగురు బిడ్డల తల్లీ, ఓ పెద్దమనిషి భార్యా అయిన ఆమె, ఆ పెద్దమనిషి విధించే శిక్షను అనుభవిస్తుంది. అంటే, ఆయన నిజంగా ఆమెను కొడతాడనో, తంతాడనో, ఇంట్లో నుంచి బయటికి తోసేస్తాడనో కాదు, అవి జరగవనీ కాదు. ఆ శిక్షలన్నీ అమలు జరిపినట్టు ఆయన నటిస్తాడు.

ఆ రోజు పిచ్చమ్మగారి తీర్పు ప్రకారం ఆమెకు దెబ్బలు పడాలనుకో. ఆమెను నడ్డి వంచి నిల్చోమని వీపున దెబ్బలు వేసినట్టు చూపడం. "నా కొడుకును కొడతావంటే" అని మధ్యలో అరవడం. తన్నులు పడాలనుకో, ఆమెను గోడవారగా నిల్చోబెట్టి, గోడకేసి తన్నుతూ ఆమెను తన్నినట్టు ప్రదర్శన. ఆమెను ఇంట్లో నుంచి వెళ్ళగొట్టాలంటే బయటకు తోసేసినట్టు నటించి, కొంతసేపు బయటే ఉంచడం. ఈ శిక్షలు అమలయ్యాక సీనుగాడూ, వాడి గ్రాండ్ మదరూ గ్రాండ్‌గా సంతృప్తి చెందుతారు. "నా కొడుకును కొడతావంటే" అని నాన్న అంటున్నప్పుడు సీనుగాడి నోరు చెవుల దాకా సాగేది.

అప్పటికి తన పెద్దక్క లలితకి పద్దెనిమిదేళ్ళూ, చిన్నక్క రమణకి పదహారేళ్ళూ, తనకు పధ్నాలుగూ ఉండి ఉంటాయి.

ఆ వయసుకు తగిన జ్ఞానమే ఉండినట్టు లేదు. నాన్నమ్మా, నాన్నా, సీనుగాడూ అమ్మను ఆ విధంగా అవమానిస్తున్నప్పుడు, ఆమెకు ఎలాగుండేదో, ఏమనుకునేదో తెలుసుకోవాలన్న తెలివే లేకపోయింది. ఇక వ్యతిరేకించాలన్న జ్ఞానమెక్కణ్ణుంచి వస్తుంది? ఒక్కోసారి వాళ్ళు గంట వాయిస్తూనే, ఆమె ఆ కోర్టుకు రాకుండా ఆలస్యం చేసేది. 'కూర మాడిపోతోంది' అనో, ఏదో కారణం చెప్పేది. బహుశా అదే ఆమె ప్రతిఘటనో, అసమ్మతో అయి ఉండాలి. ఆ సంగతి తెలిసిందెవరికి? "రంగా, రావే (అమ్మ పేరు రంగమ్మ). నీ పని తర్వాత చూసుకుందువులే. సీనుగాడి ఏడ్పు మానిపించడానికి మేమేదో తమాషా చేస్తుంటే నిజంగానే నిన్ను కొట్టినట్టు బాధపడిపోతావేం" అని నాన్నమ్మ కేకలేసేది. సీనుగాడి ఏడుపు మానిపించడానికి చేస్తున్న తమాషాగానే తమకూ కనిపించేది.

నాన్నకు ఊళ్ళో చాలా మంచివాడన్న పేరుండేది. నాన్నమ్మను కూడా చెడ్డదని ఎవరూ అన్లేదు. అమ్మా, నాన్నమ్మల మధ్య ఎప్పుడూ అత్తాకోడళ్ళ పోట్లాటలు కూడా జరిగినట్టు లేదు. అదే వీధిలో ఉన్న ఆంజనేయులైతే, కొడుకును కొట్టిందని భార్యను వీధిలోకి తోసి ములుగర్రతో రక్తం కారేట్టు కొట్టాడు. అక్కలతో కలసి బడికి వెళ్తూ తాను చూసింది. అయిదుగురు ఆడపిల్లల తర్వాత ఆంజనేయులుకు ఆ కొడుకు పుట్టాడట. "లేక లేక ఒకడు పుడితే వాణ్ణి చంపుకు తింటావా" అని ఆ రోజు ఆంజనేయులు భార్యను తిట్టడం ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. 'లేక లేక పుట్టినోడు' ఆమెకు



పుట్టినోడే అన్న సంగతి ఆంజనేయులుకు తెలీనట్లే తమకూ తెలీదు. ఆంజనేయులు కూతుళ్ళు కూడా 'తమ్ముణ్ణి' ఏడిపించినందుకు ఎప్పుడూ తండ్రి చేత దెబ్బలు తిని ఏడుస్తూ కనిపించేవాళ్ళు. అటువంటి వాతావరణంలో, తమనెన్నడూ కొట్టకుండా, అమ్మను కూడా నిజంగా కొట్టకుండా తమాషా చేసే నాన్నమ్మ, నాన్నా మంచివాళ్ళుగా కనిపించడంలో అసహజమేముంది? చూస్తే జ్ఞానం అభివృద్ధి కావడం కూడా స్థల, కాల పరిమితుల్లో జరిగేదేననిపిస్తోంది.

*  *  *

వంట చేస్తున్నా పద్మకు ఇవన్నీ కళ్ళ ముందు కనపడుతూ వచ్చాయి.

అప్పటి సీనుగాడూ, ఇప్పటి రవీ, అప్పటి నాగభూషణరావూ, ఇప్పటి మోహనూ వేరువేరుగా ఉంటూనే, వేరుగాకుండా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఇంతకు నిమిషం ముందే జ్ఞానాభివృద్ధి స్థల, కాల పరిమితుల్లో జరుగుతుందనుకుంది. కానీ, ఇక్కడేమయింది?

**"నాన్నను ఇంట్లో నుంచి పంపించమని రవి ఎందుకు అడుగుతాడు? ఈ తమాషా ఎక్కడా లేదని వాడికి తెలును. అంటే, ఈ తమాషా వాడిక్కూడా అర్థమయ్యేంత ఏకపక్షంగా ఉందన్నమాట."**

అప్పటి తానూ, ఇప్పటి తానూ వేరయినప్పుడు, వాళ్ళు మాత్రం దాదాపు అలాగే ఉండడం ఎలా సాధ్యమైనట్టు? కొడుకును కొట్టిందని భార్యను ముసుగ్రతో బాదాడు ఆంజనేయులు. నాగభూషణరావు భార్యను కొట్టలేదు కానీ, కొట్టినట్టు నటించాడు. మోహన్ కొట్టనూ లేదు, కొట్టినట్టు నటించనూ లేదు. కొడతాననీ, ఇంట్లో నుంచి పంపిస్తాననీ అన్నాడు.

సారాంశంలో ముగ్గురూ ఒక్కడే. ఆ ఒక్కడూ 'మగ'వాడు.

*  *  *

"అమ్మను కొడతాననీ, ఇంట్లో నుంచి పంపిస్తాననీ రవికి చెప్పావు. కానీ, రవిని ఎందుక్కొట్టానో నన్ను అడగలేదేం."

"చచ్చాం పో. విన్నావా, కొట్టావన్న కోపంతో రవి ఏదో చెబితే, సరేలే అన్నాను. నిన్ను అడగనేలేదంటే, నీ మీద నమ్మకం ఉన్నట్లే కదా" అని కళ్ళెగరేశాడు మోహన్.

"ఏం కాదు. నన్ను అడగకుండానే కొడతాననీ, ఇంట్లో నుంచి పంపిస్తాననీ రవితోనైనా సరే అనగలిగావంటే. అది నేనంటే నీకున్న చులకన అభిప్రాయాన్నే తెలియజేస్తుంది."

"బాబోయ్, ఎంత భయంకరమైన అర్థమో."

"నిజమే. అందులో భయంకరమైన అర్థమే ఉంది."

"ఏంటి పద్మా, 'హాయి'గా పడుకో వలసిన ఈ సమయంలో ఈ 'భయంకర మాటలు.' ఏదో తమాషాగా తీసుకో వలసిన దాన్ని ఇంత వికృతంగా చూస్తున్నావెందుకు?"

తమాషాగా తీసుకోవాలా? ఎవరు తమాషాగా తీసుకోవాలి? వేటాడడం వేటగాడికి తమాషాగానే ఉంటుంది. ఆ వేటకి బలయ్యేవాటికి అది తామాషాగా ఉండదు. తమాషాగా చూడమని వాటికి చెప్పడం మరింత క్రూరంగా ఉంటుంది. ఈ తమాషా మా నాన్న చేసేవాడు. ఇప్పుడు నువ్వు చేస్తున్నావు. తమాషాగా చూడాలని కూడా చెబుతున్నావ్. రేపు రవి కూడా ఈ తమాషా చేస్తాడు. ఆ తర్వాత వాడి కొడుకు చేస్తాడు. ఇంకో వైపు ఇది మా అమ్మకు తమాషాగా ఉండి ఉండదు. నాకూ తమాషాగా లేదు. రేపు రవి భార్యకూ ఉండదు. ఈ తమాషా ఏప్పుడూ ఒకవైపు వాళ్ళకే ఎందుకుండాలి? ఉభయులకూ తమాషాగా ఎందుకుండడం లేదు?"

"అంటే, నాన్నను కొట్టమనీ, నాన్నను ఇంట్లో నుంచి పంపించమనీ రవి అని ఉంటే సరిపోయేదా?"

"ఈ ప్రశ్న వేయడంలోనే నీ ఉక్రోషం కనిపిస్తోంది. మగవాళ్ళతో సమానంగా ఆడవాళ్ళకూ స్వేచ్ఛ ఉండాలని అంటే, 'మగవాళ్ళు అరాచకంగా ఉన్నారని ఆడవాళ్ళూ అలాగే ఉండాలా' అని అడిగినట్టుంది. నాన్నను ఇంట్లో నుంచి పంపించమని రవి ఎందుకు అడుగుతాడు? అటువంటి తమాషా ఎక్కడా లేదని వాడికప్పుడే అర్థమయింది. అంటే, ఈ తమాషా వాడిక్కూడా అర్థమయ్యేంత ఏక పక్షంగా ఉందన్నమాట. ఒకవేళ వాడు అలా అని ఉంటే, నేనేం చెప్పేదాన్నో తెలుసా?"

మోహన్ పద్మకేసి చూస్తున్నాడు.

"నువ్వేదో తప్పు చేసి ఉంటేనే నాన్న కొట్టి ఉంటాడనీ, తప్పు చెయ్యడమే కాక నాన్నను ఇంట్లో నుంచి పంపించమనడం ఇంకా తప్పనీ చెప్పేదాన్ని."

మోహన్ ఇంకా పద్మ మొహం చూస్తూనే ఉన్నాడు. అలా చూస్తూ చూస్తూ ఉండగా, తాను తమాషా అనుకున్నదాంట్లో ఉన్న విషాదం కొంచెం కొంచెంగా అర్థమవుతున్నట్టుంది. ■